సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 14 । జనవరి । 2024



పోదాం పద జాతరకు..

మల్లన్న బండ జాతరకు సర్వం సిద్ధం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు.

వివరాలు 8లో ▸



పొగ.. ఆగని సెగ

జిల్లాలో పలు ప్రాంతాలు ఎక్కడ పడితే అక్కడ పొగ తాగేస్తున్నారు.

వివరాలు 8లో ▸



పద్మశాలీల సంక్షేమానికి కృషి

పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఇద్దరికి కరోనా పాజిటివ్

పటాన్‌చెరు టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఐదుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. అలాగే నలుగురికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించారు.

పాఠశాల మరమ్మతుకు నిధులు

వట్‌పల్లి(అందోల్) : అందోల్ మండలం అక్సాన్‌పల్లి మోడల్ స్కూల్, హాస్టల్ మరమ్మతులకు మంత్రి దామోదర రాజనర్సింహ రూ.36 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ నాయకులు మహేష్ గౌడ్, నరసింహారెడ్డిలతో పాటు పలువురు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీ అయిన కలెక్టర్‌కు టీఎన్‌జీఓల సన్మానం



శరత్‌కు జ్ఞాపికను అందిస్తున్న నాయకులు

సంగారెడ్డి: జిల్లా కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన శరత్‌ను టీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ జావిద్‌అలీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, నాయకులు వెంకట్‌రెడ్డి, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సర్వతోముఖాభివృద్ధికి స్వర్గీయ మాజీ ఎమ్మెల్యేలు అప్పారావుషెట్కార్, శివారావుషెట్కార్, కిష్టారెడ్డి కృషి చేశారని.. వారి అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ చెప్పారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సురేశ్ షెట్కార్ తండ్రి స్వర్గీయ శివరావుషెట్కార్ 28వ వర్ధంతి సభ, సర్వధర్మ సమ్మేళనాన్ని శనివారం ఆయన సమాధి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివరావుషెట్కార్ దేశ స్వాతంత్ర్యం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, కర్ణాటకలోని బాల్కీ హీరేమఠం పీఠాధిపతి మహాలింగ పట్టదేవరు, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, శంకరయ్యస్వామి, డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సంగారెడ్డి టౌన్ : పట్టణ శివారులోని వైకుంఠపురంలో ధనుర్మాసంను పురస్కరించుకుని శనివారం గోదా రంగనాథుల కల్యాణాన్ని కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పటాన్‌చెరు సీఐ సస్పెన్షన్

పటాన్‌చెరు టౌన్: హత్య కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పటాన్‌చెరు సీఐ లాలునాయక్‌ను పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరంగూడ మల్లారెడ్డి కాలనీకి చెందిన లారీ యజమాని నాగేశ్వరరావు అదృశ్యం అయ్యాడు. అతని భార్య పద్మ ఫిర్యాదు మేరకు అమీన్‌పూర్ పోలీసులు గత నెల 22న కేసు నమోదు చేశారు. అయితే పాత నేరస్తుడైన శంకర్.. ఫోన్ కోసం నాగేశ్వర్‌రావును కొట్టి సాకిచెరువు కట్టపై పడేశాడు. స్థానికులు అతన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. వైద్యులు ఈ విషయాన్ని పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌కు తెలియజేశారు. కానీ అక్కడి పోలీసులు నిర్లక్ష్యంగా స్పందించడంతో సీఐ లాలూనాయక్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. క్రైమ్ సీఐ శ్రీనివాసరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.



సంగారెడ్డిలో పతంగులు కొనుగోలు చేస్తున్న జనం





● గాలిపటం.. ఉప్పొంగెను ఉత్సాహం

జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. ఈ పండుగ వచ్చిందంటే వివిధ ఆకృతులు, రంగుల్లో తయారు చేసిన పతంగులు మార్కెట్‌లో కనువిందు చేస్తాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా వాటిని ఎగురవేసేందుకు ఉత్సాహం చూపుతారు. సంగారెడ్డి పట్టణంలో పతంగుల దుకాణాలు భారీగా వెలిశాయి. శనివారం చిన్నారులు వాటిని కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



పతంగుల దుకాణంలో చిన్నారులు

చిరు ధాన్యాల జాతర

- నేటి నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
- ఎడ్ల బండ్లలో చిరు ధాన్యాల ప్రదర్శన
- నెల రోజుల పాటు 23 గ్రామాల మీదుగా కొనసాగింపు



పాతపంటల జాతరలో ఎడ్లబండ్ల ప్రదర్శన(ఫైల్)

జహీరాబాద్: చిరుధాన్యాల ఆవశ్యకతను తెలిపే పాత పంటల జాతర గ్రామాల్లో కొనసాగనుంది. రోజుకో ఊరు చొప్పున నెలరోజుల పాటు సాగే ఈ సంచార జీవ వైవిధ్య ఉత్సవం ద్వారా చిరుధాన్యాల సాగుపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పిస్తారు. జహీరాబాద్ కేంద్రంగా డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ రోజు 14వ తేదీన ప్రారంభం కానుంది.

సాగుపై అవగాహన

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు చిరు ధాన్యాల ఆవశ్యకత, సేంద్రియ విధానంలో సాగు, పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు సలహాలు సూచనలు అందిస్తారు. ఇందు కోసమే పాత పంటల జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. జహీరా బాద్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి, రాయికోడ్ మండలాల్లోని 70 గ్రామాల్లో డీడీఎస్ కార్యకలాపాలను కొనసాగిస్తోంది. సంఘంలోని మహిళా రైతులతో పాటు ఇతర రైతులకు చిరు ధాన్యాల విత్తనాల సంరక్షణ, పంటను సాగు చేసే విధానం, విత్తనాల ఎంపిక తదితర వాటిపై అవగాహన కల్పించేందుకు గాను డీడీఎస్ ఆధ్వర్యంలో జాతరకు శ్రీకారం చుట్టారు.



మాచ్‌నూర్‌లో విత్తన బ్యాంకు

ఝరాసంగం మండలంలోని మాచ్‌నూర్ గ్రామంలో డీడీఎస్ ఆధ్వర్యంలో చిరు ధాన్యాల విత్తన బ్యాంకును నిర్వహిస్తున్నారు. రైతు తమ పొలంలో పండించిన పంటలో నాణ్యమైనది ఎంపిక చేసుకుని విత్తనంగా సేకరించి నిల్వచేస్తారు. వాటిని విత్తి వానాకాలం, యాసంగిలో పంటలు పండిస్తారు. విత్తన బ్యాంకులో రైతులు తీసుకున్న విత్తనాన్ని పంట చేతికి రాగానే తిరిగి అందజేస్తారు. విత్తన బ్యాంకులు 50 నుంచి 60 రకాల విత్తనాలను నిల్వచేసి అందుబాటులో ఉంచుతారు.

పాత పంటల జాతర షెడ్యూల్

14వ తేదీన మొగుడంపల్లి మండలం జాడీ మల్కాపూర్‌లో జాతర ప్రారంభం అవుతుంది. మొగుడంపల్లి, జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో సాగుతుంది. 16న సిద్ధాపూర్ తండా, 17న గొటిగార్‌పల్లి గ్రామాల్లో కొనసాగనుంది. 18న శేఖాపూర్, 19న జంలైతండా, శేఖాపూర్ తండా, 20న లచ్చునాయక్‌తండా, 22న ఒంటిలగడ్డ తండా, 23న జీడిగడ్డతండా, 25న ఉప్పర్‌పల్లి తండా, 26న మన్నాపూర్, 27న జాంగార్‌బౌలితండా, 29న అర్జున్‌నాయక్‌తండా, మోడ్‌తండా, 31న జహీరాబాద్, ఫిబ్రవరి 1న అల్గోల్, 2న పోట్‌పల్లి, 3న రేజింతల్, 5న హూసెల్లి, గుంజోటి, 6న శంశల్లాపూర్, 7న వడ్డి, 9న బిడకన్నె గ్రామాల్లో సాగుతుంది. 12న ఝరాసంగం మండలం మాచ్‌నూర్ గ్రామంలో జాతర ముగింపు నిర్వహిస్తారు.

సొంత విత్తనాలే..

ప్రభుత్వం అందించే విత్తనాల కోసం రైతులు ఎదురు చూడకుండా తమ వద్ద పండించిన చిరు ధాన్యాల పంటల నుంచే విత్తనాన్ని ఎంపిక చేసుకుంటారు. అవి పురుగు పట్టకుండా ఉండేందుకు బూడిద, వేపాకు కలిపి ఈత బుట్టల్లో పోసి మట్టితో మూసి వేస్తారు. విత్తనాలు పెట్టే సమయంలో వాటిని బయటకు తీసి విత్తుతారు. సుమారు 70 రకాల వరకు విత్తనాలను నిల్వచేసి పెట్టుకుంటారు.

జహీరాబాద్ ఎంపీ సీటు బీజేపీదే..

ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి



మాట్లాడుతున్న వెంకటరమణా రెడ్డి

జోగిపేట (అందోల్) : త్వరలో జరగబోయే జహీరాబాద్ లోకసభ ఎన్నికల్లో బాధ్యతగా పని చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు. శనివారం అందోల్ రామాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ గ్యారంటీలపై ప్రజలే ప్రశ్నిస్తారని అన్నారు. జహీరాబాద్ పార్లమెంటు స్థానం వంద శాతం బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

రాబోయే ఎంపీ ఎన్నికలకు సిద్ధం కావాలని వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. జహీరాబాద్‌లోని అతిథి హోటల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరకు తీసుకెళ్లి ప్రచారం చేయాలని సూచించారు.

దత్తగిరిలో పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామిలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, పార్లమెంట్ ప్రభారి బద్దం మహిపాల్‌రెడ్డి, కన్వీనర్ రవికుమార్‌గౌడ్, వరంగల్ ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్, బాణాల లక్ష్మారెడ్డి, మురళీధర్ గౌడ్, వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, మఠం చంద్రశేఖర్, సుమన్ మాతృశ్రీ అనసూయ మాత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు సంక్రాంతి శుభాకాంక్షలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లింగాయత్ సమాజం సభ్యులు

సంగారెడ్డి: జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ వల్లూరు క్రాంతిని జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు శనివారం కలిశారు. సంఘం అధ్యక్షుడు ప్రసాద్ మధుశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బసవేశ్వరుడి విగ్రహం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్పీ రూపేష్‌ను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం యువజన అధ్యక్షుడు బుగ్గనగారి మల్లికార్జున్, కంది సర్పంచ్ విమలవీరేశం, కొంక రాజేశ్వర్, పట్లోళ్ల శివరాజ్ పాటిల్, రామోజీ నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీతో కలిపి చెల్లించండి



టవర్లు నిర్మించాలనుకున్న స్థలం

- తీసుకున్న డబ్బును 45 రోజుల్లో తిరిగి ఇచ్చేయండి..
- 'సాహితీ' కేసులో వినియోగదారుల కోర్టు తీర్పు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : అమీన్‌పూర్‌లో ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో వందలాది మంది వినియోగదారులకు రూ.కోట్లలో కుచ్చుటోపీ పెట్టిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి న్యాయస్థానంలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఒప్పందం చేసుకున్న మేరకు సకాలంలో అపార్టుమెంట్ నిర్మించి ఇవ్వకుండా ముఖం చాటేసిన ఈ బడా రియల్‌ఎస్టేట్ కంపెనీ వెంటనే సదరు వినియోగదారుల వద్ద తీసుకున్న డబ్బులకు 9శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని నాంపల్లి వినియోగదారుల కోర్టు తీర్పునిచ్చింది. అలాగే వారిని మానసికంగా ఇబ్బందికి గురిచేసినందుకు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ రియల్ ఎస్టేట్ కంపెనీ అమీన్‌పూర్‌లో 23 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో 32 అంతస్తులతో పది టవర్లను నిర్మిస్తున్నామని ప్రకటించింది. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో వినియోగదారుల వద్ద సుమారు రూ.వందల కోట్లు దండుకుంది. టవర్ల నిర్మాణానికి అసలు అనుమతి రాకపోయినప్పటికీ., వినియోగదారుల వద్ద పూర్తిగా డబ్బులు తీసుకుంది. ఒప్పందం మేరకు నిర్ణీత గడువులోగా అపార్టుమెంట్లు అప్పగించలేదు. దీంతో వినియోగదారులు.. తమకు జరిగిన మోసాలపై హైదరాబాద్‌లోని సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన కందూరి నరేందర్ అనే వ్యక్తి తనకు ఈ రియల్‌ఎస్టేట్ కంపెనీ చేసిన మోసంపై నాంపల్లి వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం నరేందర్ వద్ద తీసుకున్న రూ.40.52 లక్షలను 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని తీర్పు నిచ్చింది. అలాగే నరేందర్‌ను మానసికంగా ఇబ్బందులకు గురి చేసినందుకు మరో రూ.ఆరు లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొంది. 45 రోజుల్లో ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది.

పర్మిషన్లు రాకున్నా..

అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి పూర్తి స్థాయిలో అనుమతులు రాకపోయినప్పటికీ ఈ రియల్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ప్రీలాంచ్ ఆఫర్ పెట్టింది. ముందుగా డబ్బులు చెల్లిస్తే తక్కువ ధరకు అపార్ట్‌మెంట్‌లు నిర్మించి ఇస్తామని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. ప్రత్యేక మార్కెటింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకుని వినియోగదారుల వద్ద పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడింది. ఐటీ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు తమ సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు దాచుకున్న సొమ్మును చెల్లించారు. రెండేళ్లు దాటినప్పటికీ.. టవర్ల నిర్మాణాలకు పూర్తి స్థాయిలో అనుమతులు రాలేదు. ఒక్క అమీన్‌పూర్‌లో ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో వందల మంది వినియోగదారుల వద్ద రూ.400 కోట్లకు పైగా వసూలు చేసినట్లు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఇలా నగరంలో పలు చోట్ల రూ.1,800 కోట్ల వరకు ఈ సంస్థ వసూలు చేసినట్లు ఇటీవల సీసీఎస్ పోలీసులు ప్రకటించారు.

నేతల అండదండలతో..

ఈ రియల్ మోసం వెనుక రాజకీయ నేతల అండదండలున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో వసూలు చేసిన మొత్తాన్ని గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల బినామీ సంస్థలకు మళ్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దర్జాగా తోడేస్తున్నారు!



జిన్నారంలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన మట్టి తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంత

రాత్రీపగలు తేడాలేకుండా మట్టి తవ్వకాలు

- ప్రభుత్వ భూములనూ వదలని అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): కొందరు అక్రమార్కులు గుట్టలు, ప్రభుత్వ భూములను వదలడం లేదు. అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టిని తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. జిన్నారం మండల వ్యాప్తంగా నెల రోజుల నుంచి భారీగా మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. మండలంలోని మాదారం, కొండకంచి, రాళ్లకత్వ గ్రామాల్లో మట్టిని తోడుతూ శివానగర్‌లోని పలు పరిశ్రమలకు తరలిస్తున్నారు. కొడకంచి గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులే మట్టి మాఫియాగా మారి ఈ దందాను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మంత్రికుంట గ్రామంలో కూడా కొందరు నాయకులు మట్టిని తరలించారు. జిన్నారంలోని 1002 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమి నుంచి వారం రోజుల పాటు మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తరలించారు. దానిని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలు నిర్మాణానికి తరలించినట్లు తెలిసింది. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతోనే ఈ మట్టి దందా జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

> **కేసులు నమోదు చేస్తున్నాం**
>
> మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. రవాణాను గ్రామాల ప్రజలు అడ్డుకోవాలి. తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం.
>
> – మల్లికార్జున్, డిప్యూటీ తహసీల్దార్ జిన్నారం

● విఘ్నాలు తొలగించు.. శుభాలు కలిగించు



మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో గల సిద్ధి వినాయక ఆలయం భక్తులతో సందడిగా మారింది. వినాయక జయంత్యుత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం నుంచి పూజలు కొనసాగాయి. ఆలయం ప్రాంగణంలో యజ్ఞాలు నిర్వహించారు. పలువురు దాతలు భక్తులకు అన్నదానం చేశారు.

న్యాల్‌కల్(జహీరాబాద్)

క్లుప్తంగా

'వరుకోలు'కు జాతీయ సేవారత్న పురస్కారం



ఆహ్వాన పత్రాన్ని అందుకుంటున్న రాజలింగం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రాముని పట్ల గ్రామానికి చెందిన విద్యావేత్త, ప్రముఖ సంఘ సేవకులు వరుకోలు రాజలింగం జాతీయ సేవారత్న 2024 పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు కమిటీ ప్రకటించింది. ఆహ్వానపత్రాన్ని అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్ల రాధాకృష్ణ అందజేశారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే సమావేశంలో పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు. రాజలింగం ఎంతో మంది నిరుపేదలకు చదువు నేర్పించి ప్రయోజకులుగా చేశారని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినందున ఈ పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయికి ఎంపిక



వికాస్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మద్దూర్(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వికాస్ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గుమ్మడి రాజు వెంకన్న తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. వికాస్‌ను కళాశాల పీడీ ప్రేమ్ కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రామేశ్వర్ రెడ్డి తదితరులు అభినందించారు.

మల్లన్నను దర్శించుకున్న బలగం సినిమా నటుడు



స్వామివారి సన్నిధిలో మురళీధర్ గౌడ్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని బలగం సినిమా నటుడు మురళీధర్ గౌడ్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్,కరుణాకర్ పాల్గొన్నారు.

పోదాంపద జాతరకు..

- నేటి నుంచి మల్లన్న బండ జాతర
- ఉత్సాహంగా ఎడ్లబండ్లు ఊరేగింపు
- తరలిరానున్న వేలాదిమంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కోరినకోరికలు తీర్చే మల్లన్న బండ జాతరకు సర్వం సిద్ధమైంది. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి–జంగపల్లి గ్రామాల శివారులో వెలసిన విశాలమైన బండపై సంక్రాంతి పర్వదినాన జాతర ప్రారంభం అవుతుంది. ఇందుకు భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. జాతర జరిగే రోజులున్నీ బండచుట్టూ ఉన్న వీరారెడ్డిపల్లి, జంగపల్లి, అల్మాజీపూర్‌తోపాటు దౌల్తాబాద్ మండలం దొమ్మాట, గాజులపల్లి గ్రామాలు పులకించిపోతాయి. బతుకు దెరువు కోసం వలస వెళ్లినవారు సైతం జాతరకు రానున్నారు. ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)



మల్లన్న జాతరలో జన సందడి (ఫైల్)



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న దుబ్బాక సీఐ కృష్ణ

మల్లన్న బండపై బోనాలతో సంబరాలు అంబరాన్నంటుతాయి. జనవరి మొదటి రోజు నుంచి సంక్రాంతి రోజు వరకు బండ చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు బండ మల్లన్నకు బోనాలతో నైవేద్యాలు సమర్పించి అక్కడే భోజనాలు చేస్తారు. విశాలమైన ఈ బండపై రాజరాజేశ్వర సామి దేవాలయం, వెంకటేశ్వరాలయం, హనుమాన్ దేవాలయం, నాగ దేవతాలయం, పాండవుల విగ్రహాలు, పోచమ్మ దేవాలయంతోపాటు సహజ సిద్ధంగా ఏర్పడిన పుట్టు గుండం, స్వామివారి పాద ముద్రలు, మరెన్నో దేవతా మూర్తుల విగ్రహాలు దర్శనమిస్తుంటాయి. సంక్రాంతి పర్వదినమైన సోమవారం బండపై జరిగే జాతరకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

ఉత్సాహంగా బండ్ల బోనాలు

బండ చుట్టూ ఉన్న వీరారెడ్డిపల్లి, జంగపల్లి, అల్మాజీపూర్, దౌల్తాబాద్ మండలం దొమ్మాట, గాజులపల్లి తదితర గ్రామాల భక్తులు ఎడ్ల బండ్లను సుందరంగా అలంకరించి బండ్ల బోనాలతో మల్లన్న గుడి చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. యువకులు డప్పు చప్పుళ్ల నడుమ నృత్యాలు, కేరింతలు కొడుతూ సందడి చేస్తారు. జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కమిటీ సభ్యులు పర్యవేక్షించనున్నారు.

పుట్టుగుండంలో పుష్కలంగా నీరు

విశాలమైన బండపై సహజ సిద్ధంగా వెలసిన పుట్టు గుండాన్ని భక్తులు ఆసక్తిగా తిలకిస్తారు. దశాబ్దాలు గడుస్తున్నా, ఎన్ని కరువు కాటకాలు వచ్చినా, పుట్టుగుండంలో నేటికి నీరు పుష్కలంగా ఉండడం మల్లన్న దేవుడి మహిమగా భక్తులు కొనియాడతారు. గుండంలో ఉన్న నీటిని తమ పంటపొలాల్లో చల్లుకున్నట్లయితే చీడ పీడల బారినుంచి పంటలను కాపాడుకోవచ్చని చుట్టు పక్కల రైతులు పేర్కొంటారు.



బండపై వెలసిన పుట్టు గుండం

పథకాలపై అవగాహన కల్పించాలి

- కేంద్ర జౌళీ పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్‌గుప్తా
- చాట్లపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

జగదేవ్‌పూర్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని కేంద్ర జౌళీ పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్‌గుప్తా అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని చాట్లపల్లి గ్రామంలో ఎస్‌బీఐ, ఏపీజీవీబీ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అజయ్‌గుప్తా, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినయోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రతి రోజూ 14 గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మండల సమాఖ్యకు రూ. 2 కోట్ల చెక్కును అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పౌష్టికాహారం స్టాల్ అందరినీ ఆకట్టుకుంది. అతిథులకు బతుకమ్మలతో స్వాగతం పలికారు. చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జయదేవ్, డీపీఓ శివ ప్రసాద్, డీఎంహెచ్‌ఓ కాశీనాథ్, ఎంపీపీ బాలేశం గౌడ్, సర్పంచ్ నరేశ్, ఎంపీటీసీ కావ్యదర్గయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ, వివిధశాఖల అధికారులు ఆనంద్, లక్ష్మీ, తిరుమలరెడ్డి, రజిత, సునీత, మండల కో ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, కార్యదర్శిలు, అంగన్‌వాడీ టీచర్లు, సీసీలు, వీఏఓలు పాల్గొన్నారు.



చిన్నారులతో అజయ్‌గుప్తా, తదితరులు

అన్నదానాలకు పెట్టింది పేరు సిద్దిపేట

ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అన్నదానం అనగానే మొదటగా సిద్దిపేట పేరు గుర్తుకొస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22న అయోధ్యలో శ్రీ రామాలయం ఆవరణ ప్రారంభోత్సవ సందర్భంగా అక్కడికి వచ్చే భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అక్కడికి వెళ్తున్న ఆహారపదార్థాల వాహనాలను సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినిపూర శ్రీ వెంకటేశ్వర ఆలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. అయోధ్యలో రాము లోరి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా దక్షిణ భారతదేశం నుంచి ఒకే లంగర్‌లో అన్నం పెట్టె అవకాశం రావడం సిద్దిపేట ప్రజల అదృష్టమన్నారు. ఎన్నో నూతన కార్యక్రమాలకు ఆధ్యాత్మిక నెలవు సిద్దిపేట అన్నారు. హిందు ధర్మ రక్షణకు ఈ విధంగా అమర్నాథ్ సేవా సమితి సభ్యులు కృషి చేస్తున్నారని అభినందించారు.



అయోధ్యకు వెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఉత్కంఠగా కబడ్డీ పోటీలు



తలపడుతున్న రంగారెడ్డి–నారాయణపేట్ జిల్లా బాలుర జట్లు

నేడు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ పక్కన గల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న బాలబాలికల 49వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రీ క్వార్టర్ ఫైనల్ బాలికల విభాగంలో నల్గొండ–వరంగల్, గద్వాల్–నాగర్‌కర్నూల్, మేడ్చల్–జనగాం, ఆసిఫాబాద్–సూర్యాపేట్, రంగారెడ్డి–మహబూబ్‌నగర్, హన్మకొండ–వనపర్తి, మహబూబాబాద్–సిద్దిపేట, నిజామాబాద్–కరీంనగర్ జట్లు తలపడ్డాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి–నారాయణపేట, ఆదిలాబాద్–కరీంనగర్, సంగారెడ్డి–భూపాలపల్లి, కొత్తగూడెం–నాగర్‌కర్నూల్, నల్గొండ–మహబూబ్‌నగర్, యాదాద్రి భువనగిరి–సూర్యాపేట, మెదక్–మేడ్చల్, ఖమ్మం–గద్వాల్ జిల్లా జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో అధిక పాయింట్లు సాధించిన క్రీడా జట్లు సెమీఫైనల్‌కు వెళ్లనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం బాలుర, బాలికల విభాగాల్లో జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో అధిక పాయింట్లు సాధించే క్రీడా జట్లు సాయంత్రం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొంటాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

పొగ.. ఆగని సెగ

యథేచ్ఛగా బహిరంగ ధూమపానం



- అమలుకాని నిషేధ చట్టం
- జిల్లాలో గతేడాది 421 కేసులు
- జరిమానా విధిస్తున్నా మారని వైనం



పటాన్‌చెరు టౌన్: బహిరంగ స్థలాల్లో పొగ తాగడం నిషేధం.. నేరం కూడా. ప్రస్తుతం ఇది ఎక్కడా అమలు కావడం లేదు. బస్‌స్టాప్‌లు, మద్యం షాపులు, హోటళ్లు, పాన్ డబ్బాలు ఇలా ఎక్కడ పడితే అక్కడ యథేచ్ఛగా సిగరెట్ తాగుతూ కనిపిస్తున్నారు. బహిరంగ స్థలాల్లో పొగ తాగడంపై ప్రభుత్వం నిషేధం విధించింది. నిబంధనలను అతిక్రమించిన వారికి రూ.1,000 జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అయినా పొగరాయుళ్లు పట్టించుకోవడం లేదు. ఈ చట్టం కాగితానికే పరిమితమవుతోంది. పొగతాగే వారి కన్నా పీల్చే వారికే ఎక్కువ ప్రమాదకరం అని నివేదికలు చెబుతున్నాయి.

స్మోకింగ్ జోన్‌లుగా..

జిల్లాలో చాలా ప్రాంతాల్లోని చాయ్ షాపులు, పాన్ డబ్బాలు స్మోకింగ్ జోన్‌లుగా మారాయి. విచ్చలవిడిగా బీడీ, సిగరెట్, పాన్ మసాలాలు విక్రయిస్తుండడంతో ధూమపాన ప్రియులు అక్కడే తిష్ట వేసి పొగ తాగేస్తున్నారు. జిల్లాలో గతేడాది 421 కేసులు నమోదు కాగా, రూ.14,500 జరిమానా విధించినట్లు పొగాకు నియంత్రణ విభాగం అధికారులు చెబుతున్నారు.

చట్టం ఏం చెబుతోంది

సిగరెట్లు, సాగర్‌లు, బీడీలు, గుట్కా, పాన్ మసాలా ఆస్పత్రులు, విద్యా సంస్థలు, గ్రంథాలయాలు, ఆడిటోరియం, స్టేడియం, రైల్వేస్టేషన్లు, బస్‌స్టాప్ వంటి ప్రాంతాల్లో అమ్మకం, సేవించడం నిషేధమన్నారు. పొగాకు ఉత్పత్తులపై ప్రచారం చేస్తే శిక్షార్హులని పేర్కొన్నారు. పొగాకుల ఉత్పత్తుల వాడకం వల్ల ప్రాణాంతకరమైన జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. నోరు, గొంతు, పెదవి, నాలుక, ఊపిరితిత్తుల క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్, కడుపు క్యాన్సర్, అకాల వృద్ధాప్యం, బోల ఎముకల వ్యాధి వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

అడిగే వారే లేరు



బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధం ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదు. అధికారులు చర్యలు తీసుకుపోవడంతో రోజురోజుకూ ఎక్కువవుతోంది. టీ స్టాళ్లు, పాన్ షాపులు, బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగేవారు ఎక్కువగా ఉండడంతో వారు తాగి వదిలిన పొగ పక్కన ఉన్నవారు పీల్చి రోగాల బారిన పడుతున్నారు.

– నాగరాజు యాదవ్, పటాన్‌చెరు

ముమ్మరంగా తనిఖీలు



పటాన్‌చెరు సబ్ డివిజన్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం. నిషేధిత సిగరెట్లతోపాటు, గంజాయి ఎక్కడైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి. ఇటీవల రుద్రారం గ్రామ పరిధిలో నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశాం.

– పురుషోత్తంరెడ్డి, డీఎస్పీ, పటాన్‌చెరు

జరిమానా తప్పదు



బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధం, నిబంధనలు అతిక్రమిస్తే కేసులతోపాటు జరిమానాలు విధిస్తున్నాం. బస్టాండ్‌లు, హోటళ్లు, విద్యా సంస్థల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరం వరకు పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం.

– విష్ణువర్ధన్ రెడ్డి, పొగాకు నియంత్రణ విభాగం జిల్లా అధికారి

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ

సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ బీ.అనురాధ సూచించారు. పోలీసు కమిషనర్ పరిధిలో వారం రోజులుగా జరిగిన సైబర్ నేరాల వివరాలను సీపీ శనివారం తెలిపారు. గౌరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి బ్యాంక్ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని, పెండింగ్ బిల్లు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి లింకును పంపాడు. బాధితుడు ఆ లింకును ఓపెన్ చేసి తన వివరాలు, ఓటీపీ వివరాలు నమోదు చేయగానే ఖాతా నుంచి రూ.1,08,476 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో అతడు మోసపోయినట్లు గుర్తించి హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

మెడికల్ ఇన్సూరెన్స్ పేరుతో..

వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి మెడికల్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించి గుర్తు తెలియని వ్యక్తి పంపిన లింకును ఓపెన్ చేసి రూ.26,800 పోగొట్టుకున్నాడు. వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి హోల్‌సెల్ షాపు నుంచి మాట్లాడుతున్నాని ఫోన్ చేశాడు. తక్కువ ధరకు మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపాడు. మీరు చెప్పిన మెడిసిన్స్ ప్యాక్ చేసి హోం డెలివరీ చేస్తానని చెప్పగానే ఆన్‌లైన్‌లో బాధితుడు రూ.21వేలు పంపించి మోసపోయాడు. మిరుదొడ్డి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ధని లోన్ యాప్ పేరుతో వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి బాధితుడు రూ.30,125 పోగొట్టుకున్నాడు. పై సైబర్ నేరాల్లో మోసపోయిన బాధితులు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి వివరాలు తెలపకూడదని, డబ్బులు పంపకూడదని సీపీ సూచించారు.

మింగేసిన 'మృత్యు కుహరం'

- బావిలో పడి తాపీ మేస్త్రీ మృతి
- పండుగపూట విషాదం



జంపులు (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఇంటి పక్కన పాడుబడిన బావే అతడి పాలిట మృత్యుకుహరమైంది. కాలకృత్యం తీర్చుకునేందుకు వచ్చిన వ్యక్తిని మింగేసింది. ఈ విషాదకర ఘటన వర్గల్ మండలం మజీద్‌పల్లిలో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్సై అరుణ్, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మజీద్‌పల్లికి చెందిన గాలం జంపులు(55) తాపీ మేస్త్రీ, భార్య స్వరూప కూలీ పని చేస్తుంటారు. కూతురికి పెళ్లి కాగా, రమేశ్, సాదుల్లా ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో (తెల్లారితే శనివారం) కాలకృత్యాలు తీర్చుకోవడానికి లేచిన భార్య స్వరూపకు భర్త జంపులు కనిపించలేదు. కుటుంబీకులు వెతికినప్పటికీ జాడ తెలియలేదు. ఇంటి పక్కనే పాడుపడ్డ పాతబావి నీళ్లతో నిండి ఉంది. అందులోని సొరకాయ చెట్టు తీగ కదులుతుండడంతో అనుమానం వచ్చి వెతకగా జంపులు మృతదేహం లభ్యమైంది. రాత్రి కాలకృత్యాలకు వెళ్లిన భర్త పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడని భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామ మధ్యలో ప్రమాదకరంగా మారిన పాడుపడ్డ బావిని వెంటనే పూడ్చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



జంపులును బలిగొన్న పాతబావి, వృత్తంలో జంపులు ఇల్లు

కబేళాకు పశువుల రవాణా

గుట్టురట్టు చేసిన గౌరారం పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎద్దులు

వర్గల్(గజ్వేల్): కంటైనర్ లారీలో గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా కబేళాకు తరలిస్తున్న పశువుల గుట్టును వర్గల్ మండలం గౌరారం పోలీసులు రట్టు చేశారు. గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పశువుల అక్రమ తరలింపు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి వర్గల్ మండలం గౌరారం స్టేజీ పాములపర్తి క్రాస్‌రోడ్డు వద్ద మహిళా ఏఎస్సై రుక్కమ్మ, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఓ కంటైనర్ లారీని ఆపగా అందులో 37 ఎద్దులు ఉన్నాయి. వెంటనే వాహనాన్ని గౌరారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎద్దులను తరలిస్తున్న చేర్యాల మండలం వీరన్నపేటకు చెందిన గూడెపు చింటు, డ్రైవర్ నత్తి కుమార్, హెల్పర్ మట్ట స్వామిలను అదుపులోకి తీసుకున్నారు. నవాపేట పశువుల మార్కెట్‌లో ఎద్దులను కొనుగోలు చేసి జడ్చర్లలోని కబేళాకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని ఎస్సై తెలిపారు.

పండుగ సామగ్రి కొనేందుకు వచ్చి..

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన పట్టణ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాతదొమ్మాటకి చెందిన చల్లా లక్ష్మి(40) పండుగ సామగ్రి తీసుకునేందుకు శనివారం కనకారెడ్డి(వరుసకి బాబాయి)తో బైక్‌పై పట్టణ కేంద్రానికి వచ్చింది. ఇద్దరూ సామగ్రి కొనుగోలు చేసుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. పట్టణ శివారులో జరిగే రోడ్డు విస్తరణ పనుల్లో కంకర లెవల్ చేసే డోజర్ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని వెనుకకి నడుపుతూ వీరు ప్రయాణిస్తున్న బైక్ పైకి ఎక్కించాడు. ఈ ప్రమాదంలో డోజర్ టైర్ కింద పడ్డ లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, కనకారెడ్డికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ దామోదర్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన డోజర్ డ్రైవర్, యజమానిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. మృతురాలి భర్త కృష్ణారెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



ప్రమాద స్థలంలో లక్ష్మి

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

సిద్దిపేటకమాన్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు రిమాండ్ కు తరలించారు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా గంజాయి తలనిస్తున్నారని సమాచారం మేరకు ఎస్సై నర్సింహారావు సిబ్బందితో కలిసి శుక్రవారం పట్టణంలోని సిరిసిల్ల వెళ్లే బైపాస్ రోడ్‌లో పెట్రోల్ పంపు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానాస్పదంగా పట్టణానికి చెందిన ఎండీ షాదుల్, షేక్ షాహిద్, విసీల్ కనిపించడంతో వారిని తనిఖీ చేయగా బ్యాగులో 1.243 కేజీల గంజాయి లభ్యమైంది. విచారించగా మంచిర్యాలలోని ఓ వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసి సిద్దిపేట పట్టణంలో విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, డిప్లొమా, B.Tech, M.Tech, D-Pharma, B-Pharma, B.Sc (Agri), B.Sc (Nursing), B.Ed, MBA, MCA Eligible for all Govt Jobs & Further Studies. Ph: 8866977112,339 [HA-14061]

REAL ESTATE

HOUSE FOR SALE

■ Villas @ Malkapur, Sangareddy 141S/Y 1100sft top quality built-up, E/F with N-E Entrance. Ready to occupy, Prime location, Bank loan avail. 9063510400 9391003272 [HA-96194]

LAND FOR SALE

■ Prime land @ Malkapur - Sangareddy main road, 1157 S/Y, E/F, GP Layout LRS applied. Ideal for Schools/ Hospitals/ Petrol pumps etc. 9063510400, 9391003272 [HA-96195]

SERVICES

BUSINESS OFFER

■ 18–28 సం॥ల యువతి యువకులకు,RS 49 K స్వల్ప పెట్టుబడితోలోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్‌బిజినెస్ ఆదాయం. మల్టీ సర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్@15 సం॥ల నమ్మకమైన సక్సెస్‌ఫుల్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603 [HA-2583]

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926. [M-1167592]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి AC టెక్నీషియన్స్-3, డోస్ట్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ.18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-12 552 18]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.